ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 9 మార్చి 2025



రేపటి నుంచి యథావిధిగా మీకోసం కార్యక్రమం

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని యథావిధిగా కొనసాగించనున్నట్టు కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండల, మునిసిపల్ కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో ప్రజా ఫిర్యాదులు స్వీకరించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అర్జీలను సమర్పించవచ్చని ప్రజలకు సూచించారు.

సంపూర్ణంగా సన్నరకాల సాగు సాధ్యమేనా ?

ముతక రకాల బియ్యానికి లభించని ధర, డిమాండ్



ఎంటీయూ 1121 (ధృతి) ముతక రకం వరి



ఎంటీయూ 1262 సన్నరకం వరి

- రేషన్ షాపుల ద్వారా పంపిణీ అయ్యే ఈ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న అక్రమార్కులు
- పాలిష్ చేసి సన్నరకాలుగా ఎగుమతి
- ఈ క్రమంలో సన్నరకాలనే ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయం
- ఉత్తరాంధ్రలో 40 శాతం ముతక రకాలు సాగు
- దీని స్థానంలో సన్నరకాలను వ్యాప్తి చేయాలని యోచన
- సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

అనకాపల్లి అగ్రికల్చర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):

వరి పంటలో ముతక రకాల స్థానంలో సన్న రకాలను సాగులోకి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించడంలో గల సాధకబాధకాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అధ్య యనం చేస్తున్నారు. ఉత్తరాంధ్రలో 40 శాతం ముతక రకాలనే సాగు చేస్తున్న నేపథ్యంలో వాటి స్థానంలో సన్నరకాల వ్యాప్తికి ఎంత కాలం పడుతుందనే దానిపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు అంచనాలు వేస్తున్నారు.

వాస్తవానికి ముతక రకం బియ్యానికి తగిన డిమాండ్, ధర లభించడం లేదు. రేషన్ షాపుల ద్వారా పంపిణీ అయ్యే ఈ బియ్యాన్నే మిల్లర్లు అక్రమంగా కొనుగోలు చేసి పాలిష్ చేస్తున్నారు. ఇలా పాలిష్ చేసిన బియ్యాన్ని సన్నబియ్యం పేరుతో ఎగుమతి చేసే మాఫియా కూడా తయారైంది. దీంతో ప్రభుత్వం మేల్కొని ముతక రకాలకు బదులు సన్నరకాలనే ప్రోత్సహించాలని నిర్ణయించింది. ముతక రకాల ధాన్యం సేకరణను నిలిపివేయాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇటీవల వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు అధ్యక్షతన జరిగిన సదస్సులో ముతక రకాలకు దీటైన సన్న రకాల వంగడాలను రూపొందించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని కోరింది. తెలంగాణ ప్రభుత్వం కూడా సన్న వరి రకాలు సాగు చేసే రైతులకు సబ్సిడీ ఇస్తామని గత ఏడాది ప్రకటించింది. కాగా శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సన్న, ముతక రకాల సాగు ఎలా ఉంది?, మొత్తం విస్తీర్ణంలో 40 శాతం ఉన్న ముతక వరి రకాలకు బదులు సన్నరకాల వ్యాప్తికి ఎంత కాలం పడుతుందనే అంశాలపై శాస్త్రవేత్తలు, అధికారుల మధ్య చర్చ జరుగుతోంది. ఉత్తరాంధ్రలో 10 లక్షల ఎకరాల్లో వరి పండిస్తున్నారు. రబీలో ఇది 10 వేల ఎకరాలకు మించడం లేదు. రబీలో పండే వరి అంతా ముతక రకాలకు చెందిందే కావడం విశేషం. ఇటీవల కాలంలో బాగా ప్రాచుర్యం పొందుతున్న శ్రీధృతి(ఎంటీయూ1121) ముతక రకం వరికి బదులు సన్నరకాలను వ్యాప్తిలోకి తేవడం అంత సులభం కాదు.

జిల్లాల వారీగా పరిశీలిస్తే..

శ్రీకాకుళం జిల్లాలో స్వర్ణ, సాంబ సన్న రకాలు 40 శాతం విస్తీర్ణంలో సాగవుతున్నాయి. 1318, 1262 అనే సన్నరకాల విస్తీర్ణం ఇటీవల పెరుగుతోంది. ముతక రకం ఎంటీయూ 1121 రకం కూడా అధికంగానే సాగవుతోంది. శ్రీకాకుళం సన్నాలు రకం ఇక్కడ 5 శాతం కన్నా ఎక్కువ సాగవుతోంది. ఇవి కాక వసుంధర, శ్రీకూర్మ, 1061, 1064 రకాలు మిగతా విస్తీర్ణంలో సాగులో ఉన్నాయి. విజయనగరం జిల్లాలో ముతక రకం ఎంటీయూ 1121 అధిక విస్తీర్ణం(40 నుంచి 50 శాతం)లో సాగవుతోంది. సన్నరకాలైన స్వర్ణ, సాంబ 20 నుంచి 30 శాతం విస్తీర్ణంలో పండిస్తున్నారు. దిగుబడి బాగుంటున్నందున, ఆరుతడి పరిస్థితికి అనువుగా ఉన్నందున సోనా మసూరి బాగా వ్యాప్తి చెందుతోంది. ధాన్య సేకరణ నుంచి ముతక రకాలను మినహాయిస్తే సమస్యలెదురవుతాయి. విశాఖ జిల్లాలో శ్రీకాకుళం ... మిగతా 6వ పేజీలో

ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు ఎదగాలి

మంత్రి కొల్లు రవీంద్ర

- యూనిట్ల స్థాపనకు ముందుకు వస్తే ప్రభుత్వ ప్రోత్సాహం
- మహిళలకు సమాన హక్కులు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దే
- స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి కొల్లు రవీంద్ర. చిత్రంలో ప్రగడ నాగేశ్వరరావు, బత్తుల తాతయ్యబాబు ఉన్నారు

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉత్పాదకత యూనిట్లు స్థాపించి ఇతరులకు ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఆబ్కారీ, భూగర్భ గనులశాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని మంత్రి రవీంద్ర, అసెంబ్లీ స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవిలు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళల ఆర్థిక స్వావలంబనకు స్వయంశక్తి సంఘాలను దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో తొమ్మిది లక్షల స్వయం సహాయక సంఘాలు కోటి మూడు లక్షల మంది సభ్యులతో పనిచేస్తున్నాయన్నారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో ఉపాధి పొందడమే కాకుండా యూనిట్లు ఏర్పాటు చేసి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. యూనిట్ల స్థాపనకు జిల్లాలోని అనకాపల్లి మండలం కోడూరు వద్ద 30 ఎకరాల భూమిని కేటాయించిందన్నారు. ఎవరైనా యూనిట్ల స్థాపనకు ముందుకు వస్తే రతన్‌టాటా ఇన్నోవేషన్ వారితో శిక్షణ అందించి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా తోడ్పాటు అందిస్తుందన్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తండ్రికి కుమారుడే కాదు కుమార్తె కూడా వారసురాలే అని నిర్ణయించి మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు కల్పించిన మహనీయుడు దివంగత నేత ఎన్టీ రామారావు అని అన్నారు. మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో నాయకత్వం వహిస్తున్నారని కొనియాడారు. ఎంపీ సీఎం రమేశ్ మాట్లాడుతూ ప్రస్తుతం అనకాపల్లి జిల్లా మహిళా అధికారుల సారథ్యంలో నడుస్తోందన్నారు. మహిళల అభివృద్ధికి, హక్కుల సాధనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రానికి ఆదర్శంగా జిల్లాను విజయపథంలో నడిపిస్తున్న మహిళా అధికారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కులు, సమాన వేతనం కోసం ఎన్నో పోరాటాలు చేసి మహిళలు సమాన హక్కులు సాధించుకున్నారని, అందుకు గుర్తుగా అదే స్ఫూర్తిని కొనసాగించడానికి ప్రతి ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా మాట్లాడుతూ పోలీస్ శాఖలో మహిళా ఉద్యోగులు పురుషులతో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ద్వారా మహిళలకు రుణాలు, వివిధ కేటగిరిల్లో వివిధ శాఖల నుంచి ఎంపిక చేసిన ఉత్తమ మహిళలను మంత్రి రవీంద్ర, సభాపతి అయ్యన్న సత్కరించారు. అలాగే కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ జాహ్నవిలను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ ... మిగతా 6వ పేజీలో



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయకృష్ణన్. చిత్రంలో ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తదితరులు

సుజల స్రవంతి పనులకు కదలిక

బడ్జెట్‌లో రూ.605.75 కోట్లు కేటాయింపు

- భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వం ఆదేశం
- ప్రణాళికలు రూపొందిస్తున్న అధికారులు



ఎలమంచిలి నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి అనుసంధానం చేయాల్సిన పోలవరం కాలువ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర ప్రజల జీవనాడి అయిన బాబూ జగ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించి భూసేకరణ పనులను వేగవతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులను 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రెండు దశల్లో చేపట్టేందుకు రూ.2,022 కోట్ల వ్యయంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించింది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఏటా బడ్జెట్‌లో నిధులు కేటాయించడం తప్ప, నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా పనులు ముందుకు సాగకపోగా ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.17 వేల కోట్లకు పెరిగిపోయింది. వాస్తవానికి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తయిన తరువాత ఆ కాలువ చివరి 162వ కిలో మీటరు నుంచి అంటే ఎలమంచిలి, అనకాపల్లి నియోజకవర్గాల నుంచి కాలువలో నీరు ఎత్తిపోయాల్సి ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో పోలవరం ఎడమ కాలువ పనులు పడకేశాయి.

కూటమి ప్రభుత్వం వచ్చాక కదలిక

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అటు పోలవరం ఎడమ కాలువ పనులతో పాటు ఇటు ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం పనులు వేగం పుంజుకున్నాయి. వాస్తవానికి రెవెన్యూ శాఖ అంచనాల ప్రకారం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి మొత్తం 16.45 వేల ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. కానీ ఇప్పటిదాక కేవలం 7 వేల ఎకరాలు మాత్రమే భూసేకరణ పూర్తయింది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని పూర్తి చేసేందుకు అన్ని విధాలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా జిల్లాలో చేపట్టాల్సిన భూసేకరణ పనులు త్వరలోనే పూర్తి చేసి పథకం పనులు వేగవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

భూ సేకరణకు చర్యలు

పోలవరం ఎడమ కాలువ, అక్విడెక్టుల నిర్మాణ పనులకు స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. పోలవరం ఎడమ కాలువ పనులతో పాటు పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల్లో అర్ధాంతరంగా నిలిచిన అక్విడెక్టు పనులు పునఃప్రారంభమయ్యాయి. దీనికి సంబంధించిన పనులు చేపట్టేందుకు ... మిగతా 6వ పేజీలో

వమ్మవరంలో నీతి ఆయోగ్ సర్వే బృందం పర్యటన



వమ్మవరంలో సర్వే చేస్తున్న నీతి ఆయోగ్ సర్వే బృందం

ఎస్.రాయవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వమ్మవరం గ్రామంలో నీతి ఆయోగ్ రీసెర్చ్ సర్వే బృందం శనివారం పర్యటించింది. ఫీల్డ్ మేనేజర్ వికాస్ మల్కర్ ఆధ్వర్యంలో ఐదుగురు బృంద సభ్యులు గ్రామంలో పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన, వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల పెన్షన్‌లు, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, జాతీయ ఉపాధి హామీ వంటి పథకాలపై ఆరా తీశారు. ఇందులో భాగంగా లబ్ధిదారులు చెప్పిన పలు విషయాలను నీతి ఆయోగ్ రీసెర్చ్ సర్వే ... మిగతా 6వ పేజీలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.10
సహారి (సోమ)	4.54

ఇసుక తోడేళ్ల బరితెగింపు

సర్పానదిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూముల్లో రేయింబవళ్లు తవ్వకాలు

- నది గట్టు సైతం తొలగింపు
- దర్జాగా తరలించి అమ్మకాలు
- ట్రాక్టరు లోడు రూ.3 వేలు నుంచి రూ.4 వేలు వరకు విక్రయం
- చక్రం తిప్పుతున్న స్థానిక నేతలు
- పట్టించుకోని అధికారులు



జంగాలపల్లిలోని ప్రభుత్వ భూమిలో ఇసుక తరలిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇసుక అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. జంగాలపల్లిలో సర్పానదిని ఆనుకొని ఉన్న ప్రభుత్వ భూముల్లో ఉచిత మేటలు ఉండడంతో దర్జాగా తవ్వకాలు జరుపుతున్నారు. రెండు నెలలుగా రేయింబవళ్లు ఇసుక తవ్వుకుపోతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

మండలంలోని జంగాపల్లిలో సర్పానదిని ఆనుకొని ఇటు జంగాలపల్లి, అటు కోడూరు రెవెన్యూకు మధ్యలో సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూముల్లో ఇసుక మేటలు ఉండడంతో జంగాపల్లి గ్రామానికి చెందిన కొంత మంది రైతులు సాగు నిమిత్తం ఈ భూములను ఆక్రమించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టడంతో స్థానిక నాయకులు దీనిని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఆ రైతుల నుంచి ఎకరా రూ.12 లక్షలు చొప్పున అనధికారికంగా లీజుకు తీసుకుని రెండు నెలల నుంచి ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. సర్పానది గట్టును సైతం తొలగించేసి తవ్వకాలు జరుపుతున్నారు. ఇసుక తవ్వే ప్రదేశంలో ట్రాక్టర్ లోడు రూ.1500 నుంచి రూ.2 వేలు, బయట అయితే రూ.3 వేలు నుంచి రూ.4 వేల వరకు విక్రయిస్తున్నారు. రోజూ వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలించేస్తున్నారు. గనులు, రెవెన్యూ, పోలీసు అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉపమాక క్షేత్రానికి కల్యాణ శోభ

- నేటి నుంచి శ్రీవారి ఉత్సవాలు ప్రారంభం



ఉపమాక క్షేత్రం వ్యూ

నక్కపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలో అతి ప్రాచీనమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి క్షేత్రం కల్యాణశోభతో కాంతులీనుతోంది. ఆదివారం ఉదయం నుంచి శ్రీవారి వార్షిక తిరు కల్యాణోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అంకురార్పణ, అశ్వ వాహన సేవతో స్వామివారి కల్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు తెలిపారు. సోమవారం శ్రీవారి కల్యాణోత్సవానికి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలు ఈ నెల 9 నుంచి 17 వరకు జరుగుతాయి. కల్యాణోత్సవాలు సందర్భంగా సోమవారం హోం మంత్రి వంగలపూడి అనిత స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలను విజయవంతం చేసేందుకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయం బయట క్యూ లైన్లు, విశాలమైన షెడ్లు ఏర్పాటు చేశారు.



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

మిస్టరీగా ఎన్ఆర్ఐ మహిళ మృతి

ఆత్మహత్యగా పేర్కొంటున్న పోలీసులు

- హోటల్ సిబ్బంది ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదుచేశామంటూ ప్రకటన
- పోలీసుల తీరుపై సర్వత్రా అనుమానాలు

విశాఖపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని మేఘాలయ హోటల్‌లో ఎన్ఆర్ఐ మహిళ (48) అనుమానాస్పద మృతి కేసులో పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల ఆరో తేదీ మధ్యాహ్నం 1.15 గంటలకు రూమ్ నంబర్ 229లో మహిళ మృతి చెందినట్టు హోటల్ సిబ్బంది త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేస్తే, పోలీసులు శనివారం వరకూ విషయాన్ని బయటకు పొక్కనీయకుండా అత్యంత గోప్యంగా ఉంచారు. పైగా శుక్రవారం సమాచారం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు ... మిగతా 6వ పేజీలో

సంపూర్ణంగా సన్న రకాల సాగు సాధ్యమేనా?

... 5వ పేజీ తరువాయి

సన్నాలు చాలా తక్కువ విస్తీర్ణంలో ఉంది. ఎంటీయూ 1121, ఆర్ఎన్ఆర్ 15048 ముతక రకాల విస్తీర్ణం ఈ జిల్లాలో పెరుగుతోంది. అనకాపల్లి జిల్లాలో అయితే శ్రీకాకుళం సన్నాలు అధికంగా సాగులో ఉంది. ముంపు, ఆలస్యపు నాట్లు, తుఫాన్‌లను తట్టుకొనే ఈ రకంపైనే రైతులు మొగ్గు చూపుతునారు. ఎంటీయూ 1064 రకం 15 శాతం విస్తీర్ణంలో 1318, 1262 రకాలు 5శాతం విస్తీర్ణంలో ఉన్నాయి. ఉత్తర కోస్తా మొత్తం మీద ఆర్‌టీయూ 1156, ఎంటీయూ 1210, సంపత్ సోనా వంటి ప్రైవేట్ హైబ్రీడ్ రకాలు 10 శాతానికి పైగా విస్తీర్ణంలో ఉన్నాయి. రుచి బాగుంటుందని ఎంటీయూ 1224, 1262, 1318 రకాలను పండిస్తున్నారు.

రాగోలు నుంచి కొత్త రకాలు

రాగోలు పరిశోధనా స్థానం ఆర్‌జీఎల్ 7016 అనే సన్నరకం వరి వంగడాన్ని ఈ ఏడాది విడుదల చేయనున్నది. మరో రెండు రకాలు పరిశోధనలో ఉన్నాయి. పంట కాల పరిమితి, వాతావరణం, సాగునీటి పరిస్థితి, దిగుబడి, చీడపీడలను తట్టుకునే స్థితి రకాల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు ఎదగాలి

... 5వ పేజీ తరువాయి

చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, కొప్పుల వెలమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, జేసీ ఎం.జాహ్నవి, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.అనంతలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం హాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి, స్పీకర్, ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ తదితరులు పరిశీలించి నిర్వాహకులను అభినందించారు.

సుజల స్రవంతి పనులకు కదలిక

... 5వ పేజీ తరువాయి

రూ.800 కోట్ల అంచనాలతో ప్యాకేజీల వారీగా టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేయడమే కాకుండా సుజల స్రవంతి పథకం ద్వారా ఉత్తరంధ్రకు జూలై నెలాఖరు నాటికి గోదావరి జలాలను అందిస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గతంలోనే ప్రకటించారు. తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 605.75 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా తొలిదశలో పూర్తి చేయాల్సిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా భూసేకరణ విభాగం అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. పథకం భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రమామణి ఆధ్వర్యంలో భూసేకరణ పనులను వేగవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. త్వరలోనే భూసేకరణ పనులను పూర్తి చేస్తామని, అనకాపల్లి, సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో భూసేకరణ కోసం త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి రమామణి తెలిపారు.

మిస్టరీగా ఎన్ఆర్ఐ మహిళ మృతి

... 5వ పేజీ తరువాయి

వివరాలు కోరితే, అలాంటి ఘటన ఏదీ జరగలేదంటూ బుకాయించారు. చివరకు 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వార్త రావడంతో పోలీసులు హడావిడిగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో ఉంటున్న 48 ఏళ్ల ఎన్ఆర్ఐ మహిళ హోటల్ మేఘాలయ హోటల్‌లోని రూమ్ నంబర్ 229లో బాత్‌రూమ్‌లో షవర్ హెడ్‌కు ఉరివేసుకుని మృతిచెందారని పేర్కొన్నారు. అదే ప్రకటనలో హోటల్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశామని, ఆమె మృతికి కారణం ఏమిటనేది దర్యాప్తులో తేలుతుందని పేర్కొనడం గందరగోళానికి గురిచేసినట్టయింది. వాస్తవంగా ఆమెది ఆత్మహత్య అనుకుంటే ఆ విషయాన్ని మీడియా ప్రతినిధులు అడిగినప్పుడు దాచిపెట్టాల్సిన అవసరం ఉండదు. దీనిపై పోలీస్ అధికారులను వివరణ కోరితే బాధితులు సంపన్న వర్గానికి చెందినవారని, వారు తమ వివరాలను బయట పెట్టొద్దని కోరినందువల్లే చెప్పడం లేదని పేర్కొనడం విశేషం. ఇతరుల కుటుంబాల్లో ఇలాంటి విచారకరమైన ఘటనలు జరిగినప్పుడు పోలీసులు ఎందుకు ఇంత గోప్యత పాటించడం లేదనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

వైద్యుడు కూడా అమెరికా నుంచి రాక

విశాఖలోని మహారాణిపేటకు చెందిన 52 ఏళ్ల వైద్యుడు అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన నెల రోజుల కిందట విశాఖ వచ్చి హోటల్ మేఘాలయలో బస చేసినట్టు సమాచారం. 48 ఏళ్ల మహిళ కూడా చాలా ఏళ్ల కిందటే అమెరికాలో స్థిరపడ్డారు. ఇద్దరికీ వేర్వేరు వ్యక్తులతో వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. ఎన్ఆర్ఐ మహిళ ఈ నెల ఐదున అమెరికా నుంచి విశాఖ వచ్చి హోటల్ మేఘాలయలో ఎన్ఆర్ఐ వైద్యుడు బస చేసిన గదిలో ఉంటున్నట్టు సమాచారం. ద్వారకా నగర్ సమీపంలో ఒక స్థలం కొనుగోలు విషయమై ఆమె విశాఖ వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈనెల ఆరున ఉదయం హోటల్ గదిలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఉంటుందని, ఆమె ఆవేశంతో బాత్‌రూమ్‌లోకి వెళ్లి అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అదే గదిలో ఉన్న ఎన్ఆర్ఐ వైద్యుడు హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చి, వారి సహకారంతో తలుపులు బద్దలుకొట్టి లోపలకు వెళ్లిచూసేసరికి ఆమె విగతజీవిగా ఉన్నట్టు పోలీస్ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై సంబంధిత వైద్యుడిపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, అయితే పోలీసులు ఏం చేశారనేది తెలియాల్సి ఉంది.

వమ్మవరంలో నీతి ఆయోగ్ సర్వే బృందం పర్యటన

... 5వ పేజీ తరువాయి

బృందం సభ్యులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, సర్వే టీం సూపర్ వైజర్ సంధ్యారాణి, సభ్యులు భానుచందర్, లోకేశ్, లక్ష్మి, జి సంధ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎరకయ్య, వెలుగు ఏపీఎం శివప్రసాద్, హౌసింగ్ ఏఈ యోగేంద్ర, సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, టీడీపీ నేత సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



ఎలమంచిలిలో మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులను సత్కరించిన దృశ్యం



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థినులు

ఎలమంచిలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పట్టణంలో అట్టహాసంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులను ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు, ఎంపీడీఓ కొండలరావు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా లైను కొత్తూరులోని వెలుగు కార్యాలయంలో వెలుగు ఏపీఓ రాణి ఆధ్వర్యంలో కార్యాలయం చుట్టూ రంగవల్లులు వేసి, డ్వాక్రా మహిళలతో కలిసి మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మెప్మా కార్యాలయంలో మెప్మా ప్రతినిధి పద్మా ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్ ఆధ్వర్యంలో సీఐ ధనుంజయరావు, మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, పోలీసు అధికారులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సావిత్రి, రామకృష్ణ, పోలీసులు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో కస్తూర్బా విద్యాలయం, జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పాములవాక జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థినులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. అనంతరం జూనియర్ కళాశాల ఆవరణంలో విజేతలకు ఎస్ఐ రమేష్ బహుమతులు అందజేశారు. ఏఎస్ఐ సూర్యనారాయణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం పాయకరావుపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతరం మహిళా పోలీసులను సీఐ జి.అప్పన్న, ఎస్ఐ పురుషోత్తం సత్కరించారు. తర్వాత విద్యార్థినులతో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ రాయపూడి జయప్రకాష్, కట్టమూరి నూకరాజు, తాతాజీ, మురళీకృష్ణ పాల్గొన్నారు. హైమా నేత్రాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మహిళా సిబ్బందిని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, ఆసుపత్రి అధినేత డాక్టర్ పీఎస్ఆర్.ప్రసాద్ సత్కరించారు. దళిత బహుజన పార్టీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ చిత్రపటానికి డీబీపీ వ్యవస్థాపక అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దాసరి అన్నపూర్ణ, దువ్వాడ దావీదు, బోడపాటి లక్ష్మి, బదుగు అచ్చారావు, చిర్కూరు అర్జునరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలో 22 స్వయంసహాయక సంఘాలకు రూ.2.69 కోట్ల బ్యాంక్ లింకేజి రుణాల చెక్కును ఎంపీపీ పార్వతి, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు అందజేశారు. తర్వాత వివిధ రంగాల్లో రాణించిన పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సీహెచ్ఆర్‌కే.వర్మ, ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ రాజు, వెలుగు సీసీ దేవతారెడ్డి పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తిమ్మాపురం సచివాలయంలో మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు సర్పంచ్ కర్రి సత్యనారాయణ, ఆయన సతీమణి అమరావతి మహిళా ఉద్యోగులకు చీరలు పంపిణీ చేశారు.వెలుగు కార్యాలయంలో ఉత్తమ వీవోఏలను ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, ఏపీఎం శివప్రసాద్ సన్మానించి, బహుమతులు అందజేశారు. అడ్డరోడ్డులో సీఐ రామకృష్ణ, ఎస్ఐ విభీషణరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.



అచ్యుతాపురంలో పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం



రాంబిల్లి: ఎంపీడీవో జయమాధవిని సత్కరిస్తున్న సంస్థ మహిళలు



ఎలమంచిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్, పోలీసులు



పాయకరావుపేటలో మహిళా పోలీసులకు బహుమతులు ఇచ్చిన దృశ్యం

నక్కపల్లిలో..

మండల కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను ఎంపీడీవో సీతారామరాజు, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ సత్కరించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు రూ 2.39 కోట్ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని గోపాలపట్నం శివారు పెద్దిరాజుపాలెంలో శనివారం భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీలో మహిళా ఉద్యోగులను కొర్ని నాని యాదవ్ సత్కరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కోటవురట్లలో..

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. శనివారం వెలుగు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా డ్వాక్రా మహిళలకు ఆటల పోటీలు, మ్యూజికల్స్ చైర్స్, లెమన్ స్పూన్, కబడ్డీ తదితర పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలు చదువుకోవాలని, అప్పుడే మహిళలు స్వేచ్ఛగా తిరుగుతారన్నారు. అనంతరం జెడ్పీటీసీ సభ్యుడు ఉమాదేవిని ఎంపీడీవో కాశీవిశ్వనాథం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, వెలుగు సీసీ వాలీఖాన్ పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. అలాగే హెరిటేజ్ డెయిరీ ఆధ్వర్యంలో కొల్లివానిపాలెంలో 65 మంది మహిళలను సన్మానించారు. భవానీ విద్యా నికేతన్‌లో మాజీ ఎంపీ బీవీ సత్యవతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎస్ఐ సురేష్ కుమార్, హెరిటేజ్ ఆర్ఎం పి. తులసినాయుడు, మేనేజర్ కూండ్రపు శేషు, కె.సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

మండల కేంద్రంలోని ఆర్‌వైడీఎస్ కార్యాలయంలో శనివారం రూరల్ యూత్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలను ఎంపీడీవో జయమాధవి, పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్‌జే.మాధవి సత్కరించారు. కార్యక్రమంలో వాడనర్సాపురం మాజీ సర్పంచ్ సీహెచ్ ఎర్రయ్య, మత్స్యకారుల సంక్షేమ సంఘం నాయకులు ఎస్. వెంకన్న, పర్యావరణ పరిరక్షణ సమితి కార్యదర్శి సీహెచ్ జగన్‌కుమార్,రూరల్ యూత్ డెవలప్‌మెంట్ కార్యదర్శి ఎస్.నూకరాజు పాల్గొన్నారు.



నక్కపల్లిలో మహిళా సంఘాలకు రూ2.39 కోట్ల చెక్కు అందజేస్తున్న దృశ్యం



కోటవురట్ల జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవిని సన్మానిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే రాకుంటే అధికారులు డుమ్మా కొడతారా?

▸▸ మండల సమావేశంలో ఎంపీపీ గోవింద

ఎలమంచిలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశానికి ఎమ్మెల్యే రాకుంటే అధికారులు హాజరుకారాని ఎంపీపీ బోదెపు గోవింద్ ప్రశ్నించారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, రెండో శనివారం అయినా తప్పక సమావేశం నిర్వహించక తప్పలేదన్నారు. సమావేశానికి రెవెన్యూ శాఖ నుంచి ఎవరూ హాజరు కాకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సమావేశాలకు అందరు అధికారులు బాధ్యతగా రావాలని, పునరావృతం కాకుండా చూడాలని ఎంపీడీఓ కొండలరావును ఆదేశించారు. గంజాయి బారిన పడి చిన్నారులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, గంజాయిని నిర్మూలించాలన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వేసవి సమీపించిందని, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు ఏమైనా తీసుకున్నారా అంటూ అధికారులను ప్రశ్నించారు. అనంతరం వైద్య, విద్యుత్, ఉపాధి హామీ పథకం, ఎక్సైజ్ తదితర శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశం ముందుంచారు. ఎంపీడీఓ కేఎస్. కొండలరావు పి 4 సర్వే గురించి వివరించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మరిన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ఎంపీపీ రాజాన శేషు, జడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

పాయకరావుపేటలో పీ4 సర్వే ప్రారంభం



పాయకరావుపేటలో పీ4 సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు

పాయకరావుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అతి పేదలను మధ్యతరగతిలోకి తీసుకురావడం కోసం ప్రభుత్వం చేపట్టిన పీ4 సర్వే పట్టణంలో శనివారం ప్రారంభమైంది. ఈ సర్వేని ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 18వ తేదీ వరకు సర్వే జరుగు తుందన్నారు. ఈనెల 21వ తేదీన గ్రామ సభలో చదవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా దీనిపై ప్రజాభిప్రాయ సేకరణ చేయాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు దేవాది మంగాదేవి, తదితరులు పాల్గొన్నారు.

సంతపాలెంలో తాగునీరు వృథా..

▸▸ కొళాయిలకు ట్యాప్‌లు పెట్టని వైనం

రాంబిల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు పంచాయతీ సంతపాలెంలో కొళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు వృథా అవుతోంది. గ్రామంలో ప్రతి రోజూ ఉదయం కొళాయి వస్తుందని, అధిక శాతం ట్యాప్‌లు లేకపోవడంతో తాగునీరు నేలపాలవుతుందని స్థానికులు చెబుతున్నారు. వేసవి రావడంతో తాగునీటికి ఇబ్బందిగా ఉందని, కొళాయిల ద్వారా చాలీచాలని నీరు వస్తుందని వారంటున్నారు.కొన్ని నెలలుగా ఈ పరిస్థితి ఉందని, సంబంధిత అధికారులు, పంచాయతీ పాలకులు స్పందించి తాగునీరు వృథా పోకుండా కొళాయిలకు ట్యాప్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



సంతపాలెంలో వృథాగా పోతున్న నీరు

పుష్కరిణిని పరిశీలించిన ఎంపీడీవో



పుష్కరిణిని పరిశీలిస్తున్న ఎంపీడీవో సీతారామరాజు

నక్కపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఉపమాక శ్రీవారి పుష్కరిణిని శనివారం సాయంత్రం ఎంపీడీవో సీతారామరాజు పరిశీలించారు. వెంకన్న ఉత్సవాలు సందర్భంగా స్వామివారి పుష్కరిణిలో అనేకమంది భక్తులు స్నానాలాచరిస్తారు. భక్తులంతా ప్రమాదకరంగా, లోతుగా వున్న చెరువులోకి వెళ్లకుండా స్నానాల ఘాట్ల వద్ద రక్షణ రేకులు ఏర్పాటు చేశారు. ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేపట్టాలని గ్రీన్ అంబాసిడర్లను ఎంపీడీవో ఆదేశించారు. ఆయన వెంట ఆలయ మాజీ చైర్మన్ కొండబాబు, సర్పంచ్ వీరబాబు, సెక్రటరీ జయ ప్రకాశ్,కొప్పిశెట్టి శ్రీనివాసరావు ఉన్నారు.

బార్క్ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

▸▸ ఇన్‌చార్జి మంత్రికి దొప్పెర్ల వాసుల వినతి



కొల్లు రవీంద్రకు వినతిపత్రాన్ని అందిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బాబా ఆటమిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) నిర్వాసిత రైతులకు పరిహారం ఇవ్వాలని నునపర్తి ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరరావు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్రకు శనివారం వినతిపత్రాన్నిచ్చారు. తమ గ్రామానికి చెందిన రైతుల నుంచి వందెకరాలు భూసేకరణ చేశారు. ఇందులో జిరాయితీ, డీ పట్టాదారులతోపాటు సాగుదారుల వద్ద సేకరించిన భూములకు ఇంతవరకు ధర ప్రకటించ లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం భూములు తీసుకుంటామని అధికారులు సర్వేలకు వస్తున్నారని, 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారంతోపాటు ఆర్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, కొల్లి వరహాల రావు తదితరులు ఉన్నారు.

25 వరకు ప్రజాచైతన్య యాత్రలు

అచ్యుతాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25 వరకు ప్రజా చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని సీపీఎం నేతలు తెలిపారు. శనివారం తిమ్మరాజుపేటలో ప్రజా చైతన్య యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి అప్పారావు, రొంగలి రాము, ఎస్.రామునాయుడు, కె. సోమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని గ్రామాలు

అచ్యుతాపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం పది గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. దిబ్బపాలెం, ఆర్ఆర్ కాలనీ, గొర్లె ధర్మవరం, లంకధర్మవరం, వెదురువాడ, వైఎస్ఆర్ నగర్, సాయిప్రియాలేఅవుట్, బర్మాకాలనీ, మడుతూరు రోడ్‌మరిడిమాంబ కాలనీలకు ఆదివారం ఉదయం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

'నార సంచులే వాడాలి'



నారసంచులను ప్రదర్శిస్తున్న చైర్‌పర్సన్ రమాకుమారి, మునిసిపల్ కమిషనర్ ప్రసాదబాబు

ఎలమంచిలి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలో ప్లాస్టిక్ సంచులు వద్దని, నార సంచులే వాడాలని మునిసిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో కలిసి నార సంచులపై అవగాహన ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ సంచులతో అనర్థాలు, నార సంచుల వలన కలిగే మంచిని వివరించారు. కార్యక్రమంలో మెప్మా ప్రతినిధి పద్మా పాల్గొన్నారు.

నేడు గోవిందపాలెంలో రామాలయం ప్రారంభం



పూజల్లో పాల్గొన్న వివిధ సంఘాలు

రాంబిల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందపాలెంలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా సీతారామస్వామివారి విగ్రహ ప్రతిష్ఠాపనా కార్యక్రమాలు శనివారం ఉదయం నుంచి ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, పుణ్యాహవచనం పంచగవ్వ పాశన, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, వాస్తు హోమాలు, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు, టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లు పరిశీలన

నక్కపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఏర్పాట్లను పరిశీలకుడు మల్లాడి రాజేంద్రప్రసాద్, పార్టీ నాయకులు గెడ్డం బుజ్జి, తోట నగేశ్, గెడ్డం ఆకాశ్ శనివారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెలగా సుధాకర్, నల్లల రత్నాజీ, నానాజీ.శివ, శ్రీనివాసరావు, రఘు, దుర్గారావు, జగ్గన్నదొర,తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

నక్కపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిక కొత్తూరు గ్రామంలో శనివారం తెల్లవారుజామున పేకాట శిబిరంపై దాడి చేసి 8 మందిని అరెస్ట్ చేసినట్టు సీఐ కె.కుమారస్వామి చెప్పారు. పేకాట ఆడుతున్న వారి నుంచి రూ 65,250 నగదు స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశామని చెప్పారు.


కశింకోటలో ఎంపీపీ కలగ లక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం


అనకాపల్లి భీమునిగుమ్మం పాఠశాల హెచ్‌ఎంను సత్కరిస్తున్న డీఈవో


పరవాడలో ఎంపీపీ వెంకట పద్మలక్ష్మికి డ్వాక్రా మహిళలు సన్మానం


సబ్బవరంలో సత్కారం పొందిన ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

అన్ని రంగాల్లో మహిళల ప్రగతి

▸ స్త్రీమూర్తుల పాత్రను కీర్తించిన వక్తలు ▸ వివిధ రంగాల్లో రాణిస్తున్న వారికి సత్కారం

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో ఘనంగా నిర్వహించారు. అనకాపల్లిలోని భీమునిగుమ్మం జీవీఎంసీ అంబేడ్కర్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న ప్రధానోపాధ్యాయిని ఎం.రాజ్యలక్ష్మిని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సత్కరించారు. డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు, పరీక్షల విభాగం సహాయ కమిషనర్ ఎ.శ్రీధర్ రెడ్డి, డీఈవో కార్యాలయ పర్యవేక్షకులు రామలింగేశ్వరరావు, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, ఎంఈవో సీఆర్‌కే దేవరాయలు, ఓపెన్ స్కూల్ ఇన్‌చార్జి పెనుమత్స కృష్ణంరాజు, ఉపాధ్యాయ సంఘం నాయకుడు తుంపాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో గవర మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర హాజరై అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రింగురోడ్డులోని వైసీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, జడ్పీటీసీ ఈర్లె అనురాధ, మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాతలను పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, దంతులూరి దిలీప్‌కుమార్ తదితరులు సత్కరించారు.


అనకాపల్లి ఎంపీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో మాట్లాడుతున్న సీఎం రమేష్, చిత్రంలో మంత్రి రవీంద్ర, కొణతాల

తుమ్మపాల : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ సూరిబాబు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో మాట్లాడారు. అనంతరం పలువురు మహిళా ఉద్యోగులను, ప్రజా ప్రతినిధులను సత్కరించారు. ఎంపీడీవో కె.నరసింహారావు, ఈవోపీఆర్డీ కేవీవీ ప్రసాద్, ఏసీడీపీవో శశికళ, వెలుగు ఏపీఎం కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

కశింకోటలో...

కశింకోట : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ఎంపీపీ కలగా లక్ష్మిని వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మండల సమాఖ్య అధ్యక్షురాలు సీరం వెంకటలక్ష్మి సత్కరించారు. ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగ గున్నయ్యనాయుడు, ఈవోపీఆర్‌డి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే, మహిళా దినోత్సవం ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సీఐ అల్లు స్వామినాయుడు అన్నారు. శనివారం కశింకోట గ్రామ పుర వీధుల్లో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పరవాడలో...

పరవాడ : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీపీ పైలా వెంకటపద్మలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీని డ్వాక్రా మహిళలు ఘనంగా సత్కరించారు. అలాగే ఉత్తమ డ్వాక్రా గ్రూప్ ఓం గణపతి గ్రూప్ సభ్యులను ఎంపీపీ చేతుల మీదుగా సన్మానించారు. జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు, ఇన్‌చార్జి ఎంపీడీవో కె.ధర్మారావు, ఏవో రాంబాబు, వెలుగు ఏపీఎం బి. రంగారావు, రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. అలాగే, స్థానిక దీపాంజలినగర్‌లో గల దీపికా లేడీస్ క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సింహాద్రి ఎన్టీపీసీ హెడ్ ఆఫ్ ది ప్రాజెక్టు (హెచ్‌వోపీ) సమీర్‌శర్మ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దీపికా లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు నీతాశర్మ, సంస్థలోని వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, దీపికా లేడీస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆమెను ఎంపీడీవో పద్మజ సత్కరించారు. అనంతరం ఆదర్శంగా నిలుస్తున్న పలువురు మహిళలను ఎంపీపీ, ఎంపీడీవో సత్కరించారు. కార్యక్రమంలో ఏవో శివరాం ప్రసాద్, ఎంపీఎం చీకటి శ్రీనివాసరావు, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సునీత, రాజేశ్వరి పాల్గొన్నారు.

లంకెలపాలెంలో...

లంకెలపాలెం : పరవాడ పోలీసుల ఆధ్వర్యంలో లంకెలపాలెం కూడలిలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గొన్ని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ జరిపారు. సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ కృష్ణారావు, గొన్నా కళాశాల కార్యదర్శి హేమచంద్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల సాధనకు కేంద్రం ప్రాధాన్యం : ఎంపీ సీఎం రమేష్

అనకాపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభివృద్ధికి, వారి హక్కుల సాధనకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు సీఎం రమేశ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇక్కడి ఎంపీ క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటైన వేడుకల్లో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అమలు చేస్తున్న చట్ట సభలలో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుతో రానున్న కాలంలో దేశ పార్లమెంట్‌లో 250 మంది, శాసన సభల్లో 1500 మంది మహిళా ప్రతినిధులు ఎన్నిక కానున్నారని తెలిపారు. అనంతరం బీజేపీ రాష్ట్రీయ అధికార ప్రతినిధి సుహాసిని ఆనంద్‌ను సత్కరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు, మహిళా మోర్చ నాయకురాలు ధనలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా అనకాపల్లి

▸ ఈ దిశగా గ్రామ గ్రామానా ప్రజల్లో చైతన్యం నింపండి

▸ నవోదయం 2.0 ప్రచార వాహనం ప్రారంభోత్సవంలో మంత్రి కొల్లు

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నాటు సారా రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సిద్ధం చేసిన ప్రచార వాహనాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శనివారం ఇక్కడ ప్రారంభించారు. పట్టణంలోని రింగు రోడ్డులో జరిగిన ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖా రవీంద్ర మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాను నాటుసారా రహితంగా తీర్చిదిద్దేందుకు గ్రామ గ్రామాన ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ప్రచార వాహనాన్ని ప్రారంభించామన్నారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సుర్జీత్‌సింగ్ మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో ఇప్పటి వరకు 202 నాటుసారా కేసులు నమోదయ్యాయన్నారు. 107 మందిని అరెస్టు చేసి, వెయ్యి 22 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ జిల్లా అధికారి వి.సుధీర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ టి.రాజశేఖర్, అనకాపల్లి సీఐ వై.లక్ష్మణ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పదో తరగతి పరీక్షల ప్రశ్న పత్రాలు



కశింకోట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రశ్నపత్రాలు ఇక్కడి పోలీసు స్టేషన్‌కు శనివారం చేరుకున్నాయి. మండలంలోని మొత్తం ఏడు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. వీటిలో నర్సింగబిల్లి, కన్నూరుపాలెం, తాళ్లపాలెం, సెయింట్ జాన్ స్కూల్, డీపీఎన్ జిల్లా పరిషత్ పాఠశాలు ఉన్నాయి. ఆయా పాఠశాలల హెచ్‌ఎంల సమక్షంలో బాక్సులకు సీల్ వేసి భద్రపరిచారు.

'లోక్‌అదాలత్‌లతో కేసులు సత్వర పరిష్కారం'


లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీవిద్య

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కేసులు సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్‌లు దోహదపడతాయని పదవ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య అన్నారు. శనివారం కోర్టు ప్రాంగణంలో జరిగిన లోక్‌అదాలత్‌లో ఆమె మాట్లాడారు. ఇందులో భాగంగా నాలుగు బెంచ్‌లలో లోక్‌అదాలత్ నిర్వహించారు. మొత్తం మీద 1101 కేసులు పరిష్కారమయ్యాయి. రూ.ఐదు కోట్ల 32 లక్షల 17వేల 208లు కక్షిదారులకు చెల్లించబడ్డాయని న్యాయస్థానం అధికారులు తెలిపారు. మధ్యాహ్నం 650 మంది కక్షిదారులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు పి. నాగేశ్వరరావు, జి.రామకృష్ణ, బి.వి.విజయలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంజేవీఎస్ కుమార్, బీఎస్ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

కొత్తూరు : జనసేన కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సన్నాహ సభ శనివారం జరిగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పాల్గొని వీర మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ధైర్యంగా ముందుకు వచ్చి తమ ఉనికిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని తెలిపారు. అనంతరం జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావును సత్కరించారు. అలాగే, వీర మహిళలను సత్కరించారు. అనంతరం ఈ నెల 14న జరగనున్న ఆవిర్భావ దినోత్సవం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

10న గోవాడ షుగర్స్ వద్ద ధర్నా: ధర్మశ్రీ

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గోవాడ చక్కెర కర్మాగారం వద్ద ఈ నెల 10వ తేదీన నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతాంగాన్ని కూటమి సర్కారు నిర్లక్ష్యం చేసిందని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫ్యాక్టరీకి కోట్లాది రూపాయల నిధులను సమకూర్చి అభివృద్ధిపరిచినట్టు చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఫ్యాక్టరీ పరిస్థితి దయనీయంగా మారిందని వాపోయారు. రైతుల సమస్యలపై సోమవారం ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న ఎమ్మెల్సీ 'గాదె'

అనకాపల్లి టౌన్/కొత్తూరు (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత ఇక్కడి నూకాంబిక అమ్మవారిని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు టీడీపీ యువనాయకుడు దాడి జయవీర్ స్వాగతం పలికారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఇదిలావుంటే, ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడును ఎమ్మెల్యే కొణతాల శాలువాతో సత్కరించారు. శనివారం ఆయన జనసేన పార్టీ కార్యాలయంలో కొణతాలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మిత్ర సంఘాల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, కార్యదర్శి పెద్దినాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుద్ధ కాశీ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ గాదెను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల

స్టేడియంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

▸ వాకర్స్‌కు ఎంపీ సీఎం రమేష్ హామీ


అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఎంపీ, సీఎస్‌ఆర్ నిధులతో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయనున్నట్టు ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్‌తో కలిసి ఆయన స్టేడియంను పరిశీలించారు. వాకర్స్‌ను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే స్టేడియంలో సమస్యలను రత్నాకర్ ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లడంతో అభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, బీఎస్ఎంకే జోగినాయుడు, పోలారపు త్రినాథ్, భాను తదితరులు పాల్గొన్నారు.


స్టేడియంలో పర్యటిస్తున్న ఎంపీ సీఎం రమేష్

దేమునిగుమ్మం వెంకన్న కల్యాణం రేపు

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10వ తేదీన జరగనున్న శ్రీవారి కల్యాణోత్సవ పత్రికను శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు, అర్చకులు ఆవిష్కరించారు. తొమ్మిదో తేదీ రాత్రి ఏడు గంటలకు సంకల్పం, పదో తేదీ ఉదయం తొమ్మిది గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం స్వామివారి ఊరేగింపుతో మల్లవరపువారి వీధికి వెళ్లి ఎదురు సన్నాహం, రాత్రికి కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ధర్మకర్తల మండలి చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు, ఈవో రాజసులోచన తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోలి మురళీ, సీహెచ్.నూకరాజు, వేదుల సూర్యప్రభ, కొణతాల అరుణ, సోమాదుల తులసీ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

'న్యూరో వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి'


డాక్టర్ భాస్కరరావును సత్కరిస్తున్న గ్రంథాలయం ప్రతినిధులు

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : న్యూరో వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ న్యూరో సర్జరీ వైద్య నిపుణులు మళ్ల భాస్కరరావు కోరారు. స్థానిక గౌరీ గ్రంథాలయం 83వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రముఖ వైద్యులు కె.కృష్ణారావు, గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కన్వీనర్ మళ్ల బాపునాయుడు, డి.నూకఅప్పారావు, కాండ్రేగుల జగ్గారావు పాల్గొన్నారు.

పీ4 సర్వే ప్రారంభం

అనకాపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనకు ప్రస్తుతం ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు అమలుచేస్తోంది. అయితే పేదలను మరింత ఆదుకునేందుకు పీ4 సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది అత్యంత పేదలకు గుర్తించనున్నది. జిల్లాలో శనివారం నుంచి పీ4 సర్వే ప్రారంభించారు. ఈనెల 18వ తేదీ వరకు చేపట్టనున్న సర్వేలో అత్యంత పేదలను గుర్తించేందుకు అవసరమైన వివరాలను సేకరిస్తారు. ఇందుకు 27 అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకు ప్రత్యేకంగా యాప్ రూపొందించిన ప్రభుత్వం, సర్వే చేసే వార్డు/గ్రామ సచివాలయాల సిబ్బందికి అందుబాటులోకి తీసుకువచ్చింది. పీ4 సర్వేలో బియ్యం కార్డుదారులందరినీ కాకుండా వారిలో బాగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలనే ఎంపిక చేస్తారు. ఆ వివరాలను ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో సభలు ఏర్పాటుచేసి వెల్లడిస్తారు. తరువాత ఉగాది రోజున సీఎం చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలన కోసం కార్యక్రమం ప్రారంభిస్తారు. ఇప్పటివరకూ అందుకుంటున్న సంక్షేమ పథకాలపై ఈ సర్వే ఎటువంటి ప్రభావం చూపదని అధికారులు స్పష్టంచేస్తున్నారు.

నేటి నుంచి అమ్మవార్ల జాతరలు

పరవాడ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పరవాడ పైడిమాంబ, తానాం పరదేశిమాంబ అమ్మవార్ల జాతరలు ఆది నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. గ్రామాల్లో విద్యుద్దీపాలంకరణతో ప్రధాన కూడళ్లలో భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. బంధుగణం రాకతో గ్రామాల్లో కోలాహల వాతావరణం నెలకొంది.

హత్య కేసును ఛేదించిన అనకాపల్లి రూరల్ పోలీసులు

▸ ముగ్గురు నిందితుల అరెస్టు

▸ వివరాలు వెల్లడించిన ఇన్‌చార్జి డీఎస్పీ మోహనరావు

కొత్తూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కుంచంగి వద్ద ఈ నెల ఐదే తేదీన జరిగిన హత్య కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మోహన్‌రావు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బుచ్చెయ్యపేట మండలం కరక గ్రామానికి చెందిన భీమవరపు నూకేష్‌కుమార్ (28), కశింకోట మండలం శివాలయం వీధికి చెందిన పెద్దపూడి కిషోర్ తోడళ్లలని తెలిపారు. వీరిలో నూకేష్‌కుమార్ విశాఖపట్నం డాక్‌యార్డులో ఉద్యోగం చేసేవాడన్నారు. కిషోర్ కశింకోటలో బంగారం షాపు నడుపుతున్నాడన్నారు. తోడల్లుడైన కిషోర్ వ్యాపారం అభివృద్ధి చెందడాన్ని గమనించి తన ఎదుగుదలను ఓర్వలేక నూకేష్ తరచూ కిషోర్‌తో గొడవపడేవాడని డీఎస్పీ వివరించారు. ఇది భరించలేని కిషోర్, కాకినాడకు చెందిన గోరస నాగేశ్వరరావుతో కలిసి ఎలాగైనా నూకేష్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడన్నారు. నూకేష్‌ను హతమార్చితే రూ.లక్షా 50 వేలు సుపారీ ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడని తెలిపారు. పథకం ప్రకారం ఈ నెల ఐదే తేదీన నూకేష్‌ను కశింకోట మండలం రాజాం వద్ద ఉన్న ఓ దాబాకు పిలిపించారు. అక్కడ నూకేష్, నాగేశ్వరరావు, మారేడుపూడి రాజేష్‌లు మద్యం సేవించారన్నారు. అనంతరం నూకేష్‌ను నాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై అనకాపల్లి దిగబెట్టేందుకు తీసుకెళుతూ మార్గం మధ్యలో కుంచంగి జంక్షన్ వద్ద బుధవారం రాత్రి 9.45 గంటల సమయంలో ఎవరూ లేని సమయంలో తనతో తెచ్చుకున్న సర్జికల్ బ్లేడ్‌తో నూకేష్ పీక కోసి హతమార్చి అక్కడి నుంచి పరారయ్యాడని చెప్పారు. ఈ కేసులో నిందితులైన గోరస నాగేశ్వరరావు, పెద్దపూడి కిషోర్, మారేడుపూడి రాజేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వివరించారు. కేసును ఛేదించేందుకు కృషి చేసిన అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు రవికుమార్, సత్యనారాయణ, సిబ్బందిని ఆయన అభినందించారు.


సమావేశంలో నిందితులను చూపుతున్న ఇన్‌చార్జి డీఎస్పీ మోహనరావు

ప్రశాంతంగా ప్రథమ ఇంటర్ పరీక్షలు

పాడేరురూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం జరిగిన ప్రథమ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఐఈవో ఎల్.అప్పలరామ్ తెలిపారు. ప్రథమ ఇంటర్ పరీక్షకు 5,088 మంది హాజరు కావాల్సి ఉండగా 4,754 (93.43 శాతం) మంది హాజరయ్యారని, మిగిలిన 334 మంది విద్యార్థులు గైర్ హాజరయ్యారన్నారు. అదే విధంగా జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలలో నిర్వహించిన పరీక్షలకు ఒకేషనల్ గ్రూపు విద్యార్థులు 1,346 మంది హాజరు కావాల్సి ఉండగా 1,149 (85.36 శాతం) మంది హాజరు కాగా 197 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు.

గురుకుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనలో పాల్గొన్న గురుకుల పూర్వ విద్యార్థులు

జి.మాడుగుల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక గురుకుల పాఠశాలలో 2010 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం పాడేరు లగిసపల్లి లయన్ రిసార్ట్స్‌లో ఆత్మీయంగా కలుసుకున్నారు. ఈ సందర్భంలో మృతి చెందిన వారిని గుర్తు చేస్తూ వారి ఆత్మకు శాంతి నెలకోల్పాలని మౌనం పాటించారు. అనంతరం ఒకరి యోగక్షేమాలను మరొకరు తెలుసుకున్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులను వారు గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు మత్స్యరాస నారాయణరాజు, కె.రవితేజ, రఘుపతి, నందగోపాల్, సతీశ్, ప్రవీణ్, 60 మంది పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే చర్యలు

చింతపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జె. కూర్మారావు అన్నారు. శనివారం చింతపల్లి, జీకేవీధి మండలాల్లో లంబసింగి, అసరాడ గ్రామాల్లో గ్రామ సభలు, కళాజాతర ప్రదర్శనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైన సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే 14405 టోల్ ఫ్రీ నంబర్‌కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

ఏజెన్సీలో పనిచేసిన పోలీసులకు ప్రత్యేక గుర్తింపు : సీఐ

గూడెంకొత్తవీధి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతంలో పనిచేసిన పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని స్థానిక సీఐ వర ప్రసాద్ అన్నారు. సీలేరు, జీకేవీధి పోలీసు స్టేషన్‌ల నుంచి అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళుతున్న ఐదుగురు కానిస్టేబుళ్లను శనివారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ స్వగ్రామాలు, కుటుంబాలకు దూరంగా ఉంటూ గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకు శాంతి భద్రతలు కల్పించేందుకు పోలీసులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. డిపార్టుమెంట్‌లోను సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

జీకేవీధిలో మెగా ఉచిత కంటి వైద్యశిబిరం రేపు

గూడెంకొత్తవీధి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం మెగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక సీఐ వరప్రసాద్ తెలిపారు. పోలీసు, వైద్య ఆరోగ్యశాఖలు సంయుక్తంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆపరేషన్ అవసరమైన వారికి విశాఖపట్నంలో శస్త్రచికిత్సలు చేయిస్తామని, భోజన, వసతి ఉచితంగా అందజేస్తామన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పాడేరు రూరల్: మహిళా ఉద్యోగులను సన్మానించిన అధికారులు



పాడేరురూరల్: వంజంగి సభలో మాట్లాడుతున్న టీడబ్ల్యు డీడీ రజని

పాడేరురూరల్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. మినుములూరులో సర్పంచ్ లంకెల చిట్టమ్మ అధ్యక్షతన మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులను జిల్లా పంచాయతీ అధికారి బి.లవరాజు సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో పీఎస్.కుమార్, ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్.రమేష్, తదితరులు పాల్గొన్నారు. సెంటర్ ఫర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో వంజంగిలో నిర్వహించిన మహిళా దినోత్సవంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రజని మహిళల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సీపీఎఫ్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎ.నాగమణి, న్యాయవాది ఎం.శ్వేత, సెయింట్ ఆన్స్ స్కూల్ సిస్టర్ మేరీ థామస్, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్.వనుము చిట్టబ్బాయి మహిళా అధ్యాపకులను సన్మానించారు. వివిధ క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.టీఎస్.రసూల్, అధ్యాపకులు పాల్గొన్నారు. ఆదివాసీ విలేకరుల పరిరక్షణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారిణి భూలోకమ్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వి.మహేష్, కార్యదర్శి కె.కృష్ణారావు, నాయక్, కోటిబాబు, రాంబాబు, కేశవ పాల్గొన్నారు.

జి.మాడుగులలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్ఐ షణ్ముఖరావు ఆధ్వర్యంలో విద్యార్థినులతో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లిలో..

మహిళల హక్కులు, చట్టాలను పరిరక్షించాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముక్కలి కల్యాణి అన్నారు. శనివారం టీఎన్ఎస్ఎఫ్ నాయకులు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలను సన్మానించారు. అలాగే మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, రైతులను ఐసీడీఎస్ అధికారులు సన్మానించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో ఎ.లక్ష్మీదేవి, ఎంపీపీ బోయిన కుమారి, సూపర్‌వైజర్లు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా సీఆర్‌పీఎఫ్ 234బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ డి. వినీత, మహిళా అధ్యాపకులు, ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. అనంతరం స్థానిక పోలీసులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళా హోంగార్డులను సీఐ ఎం. వినోద్‌బాబు, ఎస్ఐ వెంకట రమణ ఘనంగా సత్కరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కోరాబు అనుషదేవి, ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దురియా పుష్పలత, అధ్యాపకులు పాల్గొన్నారు.



చింతపల్లి: సీఆర్‌పీఎఫ్ ఏసీ వినీతను సన్మానిస్తున్న అధ్యాపకులు



జీకేవీధి: మహిళలను సన్మానిస్తున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో సర్వాధికారాలు ఆదివాసీలకే ఉండాలి

» దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యుడు మాణిక్యం

చింతపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):షెడ్యూల్డ్ ప్రాంతాల్లో సర్వాధికారాలు ఆదివాసీలకే ఉండాలని దండకారణ్య ఉద్యోగ సమితి కేంద్ర కమిటీ సభ్యుడు సమరెడ్డి మాణిక్యం అన్నారు. శనివారం ఆర్ఐటీఐ మైదానంలో జరిగిన దండకారణ్య ఉద్యోగ సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. భూబదలాయింపు 1/70చట్టం గిరిజన ప్రాంతంలో సమర్థవంతంగా అమలు కావడం లేదన్నారు. జీవో నంబరు-3ను దేశ అత్యున్నత న్యాయస్థానం కొట్టివేయడం బాధాకరమన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు జీవో నంబరు-3 పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర సలహాదారుడు డాక్టర్ చెండా కేశ్వరరావు మాట్లాడుతూ దండకారణ్య విమోచన సమితి జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల కాలపరిమితి పూర్తికావడంతో రద్దు చేశామన్నారు. త్వరలో నూతన కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాష్ట్ర అధ్యక్షుడు కోరా ఆనంద్, కార్యదర్శి సతీశ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కండకర్ల కాంతారావు, ప్రధాన కార్యదర్శి మార్కురాజు, విద్యార్థి సంఘం రాష్ట్ర ఇన్‌చార్జి చల్లంగి కృష్ణ, కార్యదర్శి మామిడి ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలక పురుషోత్తం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాణిక్యం

పీవీటీజీ పక్కా గృహాలకు అదనంగా రూ.లక్ష

» జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ నాయక్ బాబు



గిరిజనులతో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ నాయక్‌బాబు

చింతపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకుంటున్న పీవీటీజీ లబ్ధిదారులకు ప్రభుత్వం రూ. లక్ష అదనంగా మంజూరు చేసిందని, జిల్లాలో 38,385 మంది అర్హులుగా గుర్తించామని జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.నాయక్‌బాబు అన్నారు. శనివారం మండలంలోని బలపం పంచాయతీ గిరిజన గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలపం పంచాయతీ పరిధిలో పీవీటీజీలకు 315 పక్కా గృహాలు మంజూరు చేసిందన్నారు. తొలి విడతగా రూ.2.39లక్షలు మంజూరు చేసిందని, రాష్ట్రపతి చొరవతో మరో రూ.లక్షల అదనపు నిధులు కేటాయించడం జరిగిందన్నారు. గతంలో మంజూరు చేసే రూ.1.8లక్షలతోపాటు మరో రూ.లక్ష అందుతాయన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒకరూ మార్చి 31లోగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా పీఎంఏవై గ్రామీణ 2.0 సర్వే చేయించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కె. రమణబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజారావు పాల్గొన్నారు.

సిగ్నల్స్ రాని మంప సెల్ టవర్

ఫిర్యాదు చేసినా పట్టించుకోని బీఎస్ఎన్ఎల్ అధికారులు

కొయ్యూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంప గ్రామంలో ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నుంచి గడిచిన మూడు నెలలుగా సంకేతాలు వెలువడకపోవడంతో వినియోగదారులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. దీంతో నెలవారీ రీచార్జీలు చేసుకుంటున్న వినియోగదారులు నష్టపోతున్నారు. అత్యవసర సమాచారం బంధువులు, కుటుంబసభ్యులకు వెళ్లకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. సెల్‌వన్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత మూడు నెలలుగా ఈ టవర్ నుంచి సంకేతాలు వెలువడడం నిలిచింది. ఇప్పటికైనా బీఎస్ఎల్ఎన్ అధికారులు స్పందించి సెల్ టవర్‌ను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పెసా ఉపాధ్యక్షుల ఫోరం మండల అధ్యక్షుడిగా రామకృష్ణ



ఫోరం ఎన్నికల్లో పాల్గొన్న పెసా ఉపాధ్యక్షులు

జి.మాడుగుల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పెసా ఉపాధ్యక్షుల ఫోరం మండల నూతన కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. మండలంలోని 17 పంచాయతీల పరిధిలోని పెసా ఉపాధ్యక్షులు ఫోరం మండల అధ్యక్షుడిగా లకే రామకృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కిలో శ్రీను, సెక్రటరీగా బి.సూరిపడాల్, కోశాధికారిగా కె.లక్ష్మణ్‌రావు ఎన్నియ్యారు. ఈ సందర్భంగా పెసా ఉపాధ్యక్షుల ఫోరం మండల అధ్యక్షుడు రామకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్యం, మార్కెట్లో దళారుల మోసాలపై దృష్టి కేంద్రీకరిస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 17 పంచాయతీల పెసా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా వికాసంతోనే దేశాభివృద్ధి

అరకులోయ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. అరకులోయ మండలం కొత్తభల్లుగుడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో హెచ్ఎం టి.పద్మావతి ఆధ్వ ర్యంలో ఈ వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా సంస్థ కో-ఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ లింగవివక్షత లేని సమాజాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న అకృత్యాలను అంతా ఎదురించాలన్నారు. అనంతరం విద్యార్థినులంతా మహిళా దినోత్సవం ఆకారంలో ఏర్పడి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, అరకులోయ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ పీవోగా వ్యవహరిస్తున్న హిస్టరీ అధ్యాపకురాలు వై.విజయలక్ష్మికి మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం సంస్థ విశాఖలో ట్రైబల్ బ్లేజర్ ఎక్స్‌లెన్స్ అవార్డును అందజేసి సత్కరించింది. యోగా, పర్యావరణ రంగాల్లో విజయలక్ష్మి చేస్తున్న కృషిని వక్తలు ప్రశంసించారు.

ముంచంగిపుట్టు మండలంలో...

ముంచంగిపుట్టు : మండలంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్, ఐసీడీఎస్ శాఖల ఆధ్వర్యంలో ముంచంగిపుట్టులో మహిళల హక్కులపై అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మహిళల హక్కులు, చట్టాలపై సదస్సు ఏర్పాటైంది అలాగే, దారెలలో సర్పంచ్ పాండురంగస్వామి మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళలను సన్మానించారు. బోడిపుట్టులో ఎంపీటీసీ ఎం.సుబ్బలక్ష్మి వివిధ రంగాల్లో రాణిస్తున్నవారిని సత్కరించారు. ఎంపీపీ ఎ.సీతమ్మ, ఇన్ చార్జి ఎస్ఐ సూర్యనారాయణ, ఏఎస్ఐ తిరుపతి, పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవం ఎనిమిదో తేదీ కావడంతో ఆ ఆకారంలో ఏర్పడిన అరకులోయ మండలం కొత్తభల్లుగుడ ఆశ్రమ విద్యార్థినులు

డుంబ్రిగుడ మండలంలో...

డుంబ్రిగుడ : ఇక్కడి ఐసీడీఎస్ కార్యాలయంలో ఎంపీపీ ఈశ్వరి, జడ్పీటీసీ జానకమ్మ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ప్రేమ్‌సాగర్‌తో పాటు మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, ఎస్ఐ పాపినాయుడు ఆధ్వర్యంలో ఇక్కడి జాతీయ రహదారిలోని మూడు రోడ్ల కూడలిలో విద్యార్థినులతో కలిసి మానవహారం నిర్వహించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయినులను సన్మానించారు.

పెదబయలు మండలంలో...

పెదబయలు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలంలోని సీతగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో-2 పుష్పజోసెఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ రంగారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

'గ్రీవెన్స్'కు దొన్నుదొర శ్రీకారం

» అరకులోయలో వినతులు స్వీకరణ

» అధికారులు పరిష్కరించకుంటే మంత్రులకు వివరిస్తామని వెల్లడి



దొన్నుదొరకు వినతిని అందజేస్తున్న బొర్రా పంచాయతీ సర్పంచ్ జన్ని అప్పారావు

అరకులోయ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి విజయనగరం రీజియన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి సియ్యారి దొన్నుదొర శనివారం అరకులోయలో గ్రీవెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల ప్రాంత గిరిజనులతో పాటు అన్ని మండలాల్లో ఉన్న ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రీవెన్స్‌లో వచ్చిన వినతుల సత్వర పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఏ శాఖకు సంబంధించిన ఫిర్యాదులు ఉంటే, ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు. వారు పరిష్కరించుకుంటే సంబంధిత మంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. అనంతగిరి మండలం బొర్రా గ్రామ పంచాయతీ సర్పంచ్ జన్ని అప్పారావు, మాజీ సర్పంచ్ సమర్ది ప్రసన్నకుమార్‌లు దొన్నుదొర కలిసి బొర్రాగుహల ఆదాయం నుంచి గ్రామ పంచాయతీకి 20 శాతం కేటాయించడంతో భాగంగా సుమారు రూ.ఎనిమిది కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. నేటికి కేవలం పలు దఫాలుగా ఆందోళనలు చేస్తే కేవలం రూ.90 లక్షలు మాత్రమే చెల్లించారన్నారు. సమతా జడ్జిమెంట్ ప్రకారం గ్రామ పంచాయతీల అభివృద్ధికి పర్యాటక సంస్థ ఆదాయం నుంచి 20శాతం నిధులు మంజూరు చేయాల్సి ఉందన్నారు. పర్యాటక సంస్థ నిధులు చెల్లించడంతో నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు. అదే విధంగా పెదలబుడు పంచాయతీ పరిధి బొండగుడ మహిళలు గ్రామంలో మంచి నీటి పథకానికి సంబంధించిన మోటారు చోరీకి గురైందని పేర్కొన్నారు. మోటారు లేకపోవడంతో గ్రామంలో మంచినీటి సరఫరా నిలిచిపోయిందని వాపోయారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టి మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలని విన్నవించారు. అలాగే, వివిధ మండలాల నుంచి ప్రజలు తరలి వచ్చి వారి సమస్యలపై వినతులు అందజేశారు. నియోజకవర్గ నేతలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, తొలుత అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలో ఎంపిక చేసిన పలువురు మహిళలను దొన్నుదొర దుశ్శాలువాలు కప్పి సత్కరించారు.

మిస్టరీగా ఎన్ఆర్ఐ మహిళ మృతి

... 5వ పేజీ తరువాయి

వివరాలు కోరితే, అలాంటి ఘటన ఏదీ జరగలేదంటూ బుకాయించారు. చివరకు 'ఆంధ్రజ్యోతి'లో శనివారం వార్త రావడంతో పోలీసులు హడావిడిగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో ఉంటున్న 48 ఏళ్ల ఎన్ఆర్ఐ మహిళ హోటల్ మేఘాలయ హోటల్‌లోని రూమ్ నంబర్ 229లో బాత్‌రూమ్‌లో షవర్ హెడ్‌కు ఉరివేసుకుని మృతిచెందారని పేర్కొన్నారు. అదే ప్రకటనలో హోటల్ మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశామని, ఆమె మృతికి కారణం ఏమిటనేది దర్యాప్తులో తేలుతుందని పేర్కొనడం గందరగోళానికి గురిచేసినట్టయింది. వాస్తవంగా ఆమెది ఆత్మహత్య అనుకుంటే ఆ విషయాన్ని మీడియా ప్రతినిధులు అడిగినప్పుడు దాచిపెట్టాల్సిన అవసరం ఉండదు. దీనిపై పోలీస్ అధికారులను వివరణ కోరితే బాధితులు సంపన్న వర్గానికి చెందినవారని, వారు తమ వివరాలను బయట పెట్టొద్దని కోరినందువల్లే చెప్పడం లేదని పేర్కొనడం విశేషం. ఇతరుల కుటుంబాల్లో ఇలాంటి విచారకరమైన ఘటనలు జరిగినప్పుడు పోలీసులు ఎందుకు ఇంత గోప్యత పాటించడం లేదనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

వైద్యుడు కూడా అమెరికా నుంచి రాక

విశాఖలోని మహారాణిపేటకు చెందిన 52 ఏళ్ల వైద్యుడు అమెరికాలో స్థిరపడ్డారు. ఆయన నెల రోజుల కిందట విశాఖ వచ్చి హోటల్ మేఘాలయలో బస చేసినట్టు సమాచారం. 48 ఏళ్ల మహిళ కూడా చాలా ఏళ్ల కిందటే అమెరికాలో స్థిరపడ్డారు. ఇద్దరికీ వేర్వేరు వ్యక్తులతో వివాహమై పిల్లలు కూడా ఉన్నారు. ఎన్ఆర్ఐ మహిళ ఈ నెల ఐదున అమెరికా నుంచి విశాఖ వచ్చి హోటల్ మేఘాలయలో ఎన్ఆర్ఐ వైద్యుడు బస చేసిన గదిలో ఉంటున్నట్టు సమాచారం. ద్వారకా నగర్ సమీపంలో ఒక స్థలం కొనుగోలు విషయమై ఆమె విశాఖ వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఈనెల ఆరున ఉదయం హోటల్ గదిలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి ఉంటుందని, ఆమె ఆవేశంతో బాత్‌రూమ్‌లోకి వెళ్లి అఘాయిత్యానికి పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. బాత్‌రూమ్‌కు వెళ్లిన ఆమె ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో అదే గదిలో ఉన్న ఎన్ఆర్ఐ వైద్యుడు హోటల్ సిబ్బందికి సమాచారం ఇచ్చి, వారి సహకారంతో తలుపులు బద్దలుకొట్టి లోపలకు వెళ్లిచూసేసరికి ఆమె విగతజీవిగా ఉన్నట్టు పోలీస్ సిబ్బంది చెబుతున్నారు. దీనిపై సంబంధిత వైద్యుడిపై కేసు నమోదు చేయాల్సి ఉంటుందని, అయితే పోలీసులు ఏం చేశారనేది తెలియాల్సి ఉంది.

సుజల స్రవంతి పనులకు కదలిక

... 5వ పేజీ తరువాయి

రూ.800 కోట్ల అంచనాలతో ప్యాకేజీల వారీగా టెండర్ల ప్రక్రియ పూర్తిచేశారు. పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేయడమే కాకుండా సుజల స్రవంతి పథకం ద్వారా ఉత్తరాంధ్రకు జూలై నెలాఖరు నాటికి గోదావరి జలాలను అందిస్తామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గతంలోనే ప్రకటించారు. తాజాగా కూటమి ప్రభుత్వం రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఈ పథకానికి రూ. 605.75 కోట్లు కేటాయించింది. ఇందులో భాగంగా తొలిదశలో పూర్తి చేయాల్సిన భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా భూసేకరణ విభాగం అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేసింది. పథకం భూసేకరణ విభాగం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రమామణి ఆధ్వర్యంలో భూసేకరణ పనులను వేగవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. త్వరలోనే భూసేకరణ పనులను పూర్తి చేస్తామని, అనకాపల్లి, సబ్బవరం, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో భూసేకరణ కోసం త్వరలోనే టెండర్లు పిలవనున్నట్టు 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి రమామణి తెలిపారు.

ఉపాధి కల్పించే స్థాయికి మహిళలు ఎదగాలి

... 5వ పేజీ తరువాయి

చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, రోడ్ల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, కొప్పుల వెలమ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్, జేసీ ఎం.జాహ్నవి, డీఆర్‌వో వై.సత్యనారాయణరావు, ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.శచీదేవి, మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కె.అనంతలక్ష్మి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం హాల్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి, స్పీకర్, ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ తదితరులు పరిశీలించి నిర్వాహకులను అభినందించారు.

వమ్మవరంలో నీతి ఆయోగ్ సర్వే బృందం పర్యటన

... 5వ పేజీ తరువాయి

బృందం సభ్యులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, సర్వే టీం సూపర్ వైజర్ సంధ్యారాణి, సభ్యులు భానుచందర్, లోకేశ్, లక్ష్మి, జి సంధ్య, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఎరకయ్య, వెలుగు ఏపీఎం శివప్రసాద్, హౌసింగ్ ఏఈ యోగేంద్ర, సర్పంచ్ పాలపర్తి పాపారావు, ఎంపీటీసీ బాలం సూరిబాబు, టీడీపీ నేత సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణంగా సన్నరకాల సాగు సాధ్యమేనా?

... 5వ పేజీ తరువాయి

సన్నాలు చాలా తక్కువ విస్తీర్ణంలో ఉంది. ఎంటీయూ 1121, ఆర్ఎన్ఆర్ 15048 ముతక రకాల విస్తీర్ణం ఈ జిల్లాలో పెరుగుతోంది. అనకాపల్లి జిల్లాలో అయితే శ్రీకాకుళం సన్నాలు అధికంగా సాగులో ఉంది. ముంపు, ఆలస్యపు నాట్లు, తుఫాన్‌లను తట్టుకొనే ఈ రకంపైనే రైతులు మొగ్గు చూపుతునారు. ఎంటీయూ 1064 రకం 15 శాతం విస్తీర్ణంలో 1318, 1262 రకాలు 5శాతం విస్తీర్ణంలో ఉన్నాయి. ఉత్తర కోస్తా మొత్తం మీద ఆర్‌టీయూ 1156, ఎంటీయూ 1210, సంపత్ సోనా వంటి ప్రైవేట్ హైబ్రీడ్ రకాలు 10 శాతానికి పైగా విస్తీర్ణంలో ఉన్నాయి. రుచి బాగుంటుందని ఎంటీయూ 1224, 1262, 1318 రకాలను పండిస్తున్నారు.

రాగోలు నుంచి కొత్త రకాలు

రాగోలు పరిశోధనా స్థానం ఆర్‌జీఎల్ 7016 అనే సన్నరకం వరి వంగడాన్ని ఈ ఏడాది విడుదల చేయనున్నది. మరో రెండు రకాలు పరిశోధనలో ఉన్నాయి. పంట కాల పరిమితి, వాతావరణం, సాగునీటి పరిస్థితి, దిగుబడి, చీడపీడలను తట్టుకునే స్థితి రకాల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నాయి.

పీ4 సర్వే ప్రారంభం

జిల్లాలో ఈ నెల 18 వరకూ నిర్వహణ

బాగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాల గుర్తింపు

అనకాపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి):

పేదరిక నిర్మూలనకు ప్రస్తుతం ప్రభుత్వం వివిధ రకాల కార్యక్రమాలు అమలుచేస్తోంది. అయితే పేదలను మరింత ఆదుకునేందుకు పీ4 సర్వే చేపట్టింది. ఈ సర్వే ద్వారా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది అత్యంత పేదలకు గుర్తించనున్నది. జిల్లాలో శనివారం నుంచి పీ4 సర్వే ప్రారంభించారు. ఈనెల 18వ తేదీ వరకు చేపట్టనున్న సర్వేలో అత్యంత పేదలను గుర్తించేందుకు అవసరమైన వివరాలను సేకరిస్తారు. ఇందుకు 27 అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. ఇందుకు ప్రత్యేకంగా యాప్ రూపొందించిన ప్రభుత్వం, సర్వే చేసే వార్డు/గ్రామ సచివాలయాల సిబ్బందికి అందుబాటులోకి తీసుకువచ్చింది. పీ4 సర్వేలో బియ్యం కార్డుదారులందరినీ కాకుండా వారిలో బాగా పేదరికంలో ఉన్న 20 శాతం కుటుంబాలనే ఎంపిక చేస్తారు. ఆ వివరాలను ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిల్లో సభలు ఏర్పాటుచేసి వెల్లడిస్తారు. తరువాత ఉగాది రోజున సీఎం చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలన కోసం కార్యక్రమం ప్రారంభిస్తారు. ఇప్పటివరకూ అందుకుంటున్న సంక్షేమ పథకాలపై ఈ సర్వే ఎటువంటి ప్రభావం చూపదని అధికారులు స్పష్టంచేస్తున్నారు.

చెరకు రసం బయటకు వదిలేసి గోవాడను ముంచేస్తున్నారు..

ప్రభుత్వ మాజీ విప్ ధర్మశ్రీ



చోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చెరకు రసం బయటకు వదిలేసి గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ముంచేస్తున్నారని ప్రభుత్వ మాజీ విప్, వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ ఆరోపించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ క్రషింగ్ చేసిన చెరకు రసాన్ని పంచదార తయారు చేయలేక వృథాగా బయటకు విడచిపెడుతున్నారని, ఇలాగైతే ఫ్యాక్టరీ మరింత నష్టపోవడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాగైతే ఫ్యాక్టరీ మూతపడడం ఖాయమని అభిప్రాయం వ్యక్తం చేశారు. తక్షణమే ఫ్యాక్టరీని గాడిలో పెట్టాలని కోరారు.

చెరకు ఎండిపోతున్నా పట్టించుకోరా?

సీడీసీ చైర్మన్ శ్రీనివాసరావు



చోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కాటాల వద్ద చెరకు ఎండిపోతున్నా పట్టించుకోరా? అని చెరకు అభివృద్ధి మండలి ఛైర్మన్ సుంకర శ్రీనివాసరావు ప్రశ్నించారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ చరిత్రలో ఏనాడూ లేని విధంగా రోజుల తరబడి కాటాల వద్ద చెరకు తరలించకుండా ఉంచేయడంతో రైతులు నష్టపోతున్నారని వాపోయారు. చెరకు రైతులకు అండగా నిలవాల్సిన యాజమాన్యం, తిరిగి నష్టానికి గురిచేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. చెరకు రైతులు, కార్మికుల జీవితాలతో ఆడుకోవద్దని, గోవాడ ఫ్యాక్టరీని చక్కదిద్ది రైతులకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కోఆపరేటివ్ కాలనీలో వైద్య శిబిరం

చోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోఆపరేటివ్ కాలనీలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. రోగులు ఈసీజీ బీపీ, రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ట్రస్ట్ ఫౌండేషన్ ఛైర్మన్ కండెల్లి వెంకటరావు, సభ్యులు ఎం.అప్పారావు, వసంత పైడారావు, భూపతిరాజు, ఎర్రంశెట్టి ప్రసాద్, వేచలపు ప్రకాశ్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జగదీశ్వరరావు (ఫైల్ ఫొటో)

నర్సీపట్నం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్టుపల్లి, పాతలక్ష్మీపురం గ్రామాల మధ్యలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రాజారావు అందించిన వివరాల ప్రకారం... నర్సీపట్నం అయ్యన్న కాలనీకి చెందిన పెద్దిరెడ్డి జగదీశ్వరరావుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వి.మాడుగుల నుంచి వస్తుండగా చెట్టుపల్లి, లక్ష్మీపురం గ్రామాల మధ్యలో చెట్టును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జగదీశ్వరరావు మృతి చెందాడు. బైక్‌పై ఉన్న సతీశ్, జి.లోవరాజు తీవ్రంగా గాయపడ్డారు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

22 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

కృష్ణాదేవిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ నుంచి తరలిస్తున్న 22 కిలోల గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. కృష్ణాదేవిపేట సాయిబాబా గుడి వద్ద సిబ్బందితో వాహనాలు తనిఖీలు చేస్తుండగా, అనంతపురం జిల్లా గోరింతల మండలం పెట్లకుంటపల్లి గ్రామానికి చెందిన మనోహర్, అల్లూరి జిల్లా జీకే.వీధి మండలం లక్కవరపుపేట గ్రామానికి చెందిన కంకిపాటి రామలింగంపడాల్ బ్యాగుల్లో గంజాయి ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి గంజాయి, బైక్, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

టేకు దుంగల తరలింపును అడ్డుకున్న వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

రోలుగుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అన్ని అనుమతులతో టేకు దుంగలు తరలిస్తుండగా అడ్డుకున్న తమరాన రాజు, తమరాన రాంబాబుపై రోలుగుంట గ్రామానికి చెందిన మడ్డు రమణమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారసత్వంగా దఖలు పడిన తమ భూమిలో టేకు చెట్లు ఉన్నాయని, అధికారుల అనుమతులతో వాటిని నరికి కలప తరలిస్తుండగా అడ్డుకున్నారని చెప్పారు. వీరిని సుర్ల శ్రీను, పోతల శ్రీనులు ప్రోత్సహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

కొత్తూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం కుంచంగి వద్ద ఈ నెల ఐదే తేదీన జరిగిన హత్య కేసును రూరల్ పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ మోహన్‌రావు శనివారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బుచ్చెయ్యపేట మండలం కరక గ్రామానికి చెందిన భీమవరపు నూకేష్‌కుమార్ (28), కశింకోట మండలం శివాలయం వీధికి చెందిన పెద్దపూడి కిషోర్ తోడళ్లులని తెలిపారు. వీరిలో నూకేష్‌కుమార్ విశాఖపట్నం డాక్‌యార్డులో ఉద్యోగం చేసేవాడన్నారు. కిషోర్ కశింకోటలో బంగారం షాపు నడుపుతున్నాడన్నారు. తోడల్లుడైన కిషోర్ వ్యాపారం అభివృద్ధి చెందడాన్ని గమనించి తన ఎదుగుదలను ఓర్వలేక నూకేష్ తరచూ కిషోర్‌తో గొడవపడేవాడని డీఎస్పీ వివరించారు. ఇది భరించలేని కిషోర్, కాకినాడకు చెందిన గోరస నాగేశ్వరరావుతో కలిసి ఎలాగైనా నూకేష్‌ను హతమార్చాలని నిర్ణయించుకున్నాడన్నారు. నూకేష్‌ను హతమార్చితే రూ.లక్షా 50 వేలు సుపారీ ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడని తెలిపారు. పథకం ప్రకారం ఈ నెల ఐదే తేదీన నూకేష్‌ను కశింకోట మండలం రాజాం వద్ద ఉన్న ఓ దాబాకు పిలిపించారు. అక్కడ నూకేష్, నాగేశ్వరరావు, మారేడుపూడి రాజేష్‌లు మద్యం సేవించారన్నారు. అనంతరం నూకేష్‌ను నాగేశ్వరరావు ద్విచక్ర వాహనంపై అనకాపల్లి దిగబెట్టేందుకు తీసుకెళుతూ మార్గం మధ్యలో కుంచంగి జంక్షన్ వద్ద బుధవారం రాత్రి 9.45 గంటల సమయంలో ఎవరూ లేని సమయంలో తనతో తెచ్చుకున్న సర్జికల్ బ్లేడ్‌తో నూకేష్ పీక కోసి హతమార్చి అక్కడి నుంచి పరారయ్యాడని చెప్పారు. ఈ కేసులో నిందితులైన గోరస నాగేశ్వరరావు, పెద్దపూడి కిషోర్, మారేడుపూడి రాజేష్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని డీఎస్పీ వివరించారు. కేసును ఛేదించేందుకు కృషి చేసిన అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐలు రవికుమార్, సత్యనారాయణ, సిబ్బందిని ఆయన అభినందించారు.





నర్సీపట్నంలో విజేతలకు బహుమతులను అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు... చోడవరంలో మహిళా నేతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాజు

ఘనంగా మహిళా దినోత్సవం

నర్సీపట్నం అర్బన్/మాకవరపాలెం/నాతవరం/గొలుగొండ/కృష్ణాదేవిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఈ సందర్భంగా డీఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ట్రైనీ డీఎస్పీ చైతన్య, సీఐ గోవిందరావు పాల్గొన్నారు. అలాగే స్పీకర్ అయ్యన్న సతీమణి పద్మావతిని నేషనల్ కోచ్, బాక్సర్ వేపాడ ప్రియాంకను సన్మానించారు. నాతవరంలో జనసేన నర్సీపట్నం ఇన్‌చార్జి రాజాన సూర్యచంద్ర మహిళ దినోత్సవం నిర్వహించారు. ఎ.శరభవరంలో లక్ష్మీప్రసన్న జీడిపిక్కల ఫ్యాక్టరీలో టీడీపీ నేత వి.కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తాండవ ఛైర్మన్ కరక సత్యనారాయణ, నాయకులు చిరంజీవిరాజు, ఎస్.వెంకటరమణ, వి.గంగాధర్ పాల్గొన్నారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాల, వెలుగు, ఉపాధి పథకం కార్యాలయాల్లో మహిళలకు సత్కరించారు. ఏపీఎం మంగ, ఏపీవో వరలక్ష్మి పాల్గొన్నారు. గొలుగొండ ఎస్ఐ పి.రామారావు మహిళా పోలీసులను సత్కరించారు. ఏఎల్‌పురంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశ్రీ అంగన్‌వాడీ కార్యకర్తలను సత్కరించారు.

చోడవరం నియోజకవర్గంలో...

చోడవరం/రావికమతం/రోలుగుంట, బుచ్చెయ్యపేట: చోడవరం నియోజకవర్గంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చోడవరం, రావికమతం, రోలుగుంట, బుచ్చెయ్యపేట మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రాజు మాట్లాడారు. చోడవరంలో ఎంపీపీ గాడి కాసు, ఎంపీటీసీ సభ్యురాలు రూపవతి, టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, పలువురు మహిళలను ఎమ్మెల్యే సత్కరించారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేశ్, వెలుగు ఏపీవో తిలక్ పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో 9వ అదనపు జిల్లా కోర్టు జడ్జి కె.రత్నకుమార్ మహిళల హక్కులు, చట్టాలు గురించి వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.గౌరీశంకర్, జడ్జి ఎ.రమేశ్, సీఐ అప్పలరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్, రోలుగుంట ఎంపీడీవో నాగేశ్వరరావు, నాయకులు జి.చంద్రమౌళి, సుర్ల రామకృష్ణ, పి.చంద్ర, బుచ్చెయ్యపేటలో తహసీల్దార్ ఎం.లక్ష్మి, ఈవోపీఆర్‌డీ విజయలక్ష్మి, ఏపీఎం రాజుబాబు, ఉద్యోగులు, ఎంపీపీ డి.నాగేశ్వరిదేవి, నాయకులు జి.కోటేశ్వరరావు, ఎంవీ.సత్యనారాయణ, డొంకిన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల నియోజకవర్గంలో...

మాడుగుల/దేవరాపల్లి/చీడికాడ: మాడుగుల నియోజకవర్గంలోన మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ మండలాల్లో మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. మాడుగుల ఎంపీపీ రాజారాం, ఎంపీడీవో కొంకి అప్పారావు ఆధ్వర్యంలో మహిళా సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉద్యోగులను సత్కరించారు. సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యులు పి.విజయలక్ష్మి, కె.మహేశ్వరి పాల్గొన్నారు. చీడికాడలోని బైలపూడి పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కురచా జయమ్మ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. సర్పంచ్ జ.ఎ.గంగతల్లి, ఎంపీటీసీ గాడి నాగరత్నంలను సన్మానించారు. అలాగే ఎంపీపీ జయమ్మను అధికారులు సత్కరించారు. ఏపీఎం కనకమ్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థ పరిశీలకుడు ప్రసాద్, నాయకులు జాజిమొగ్గల సత్యనారాయణ, పాల్గొన్నారు. దేవరాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతల బుల్లి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరిగింది. ఎంపీపీ బుల్లిలక్ష్మిని అధికారులు సత్కరించారు. తహసీల్దార్ పి.లక్ష్మీదేవీ, ఎంపీడీవో సువర్ణరాజు, ఎస్ఐ రాములమ్మ, ఏవో ఎల్.వై.కాంతమ్మ, లక్ష్మీనారాయణ, వైద్యాధికారి వనజ, వైస్ ఎంపీపీ భవానీ, జడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచులు వరలక్ష్మి, కె.పుష్ప పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల రూరల్/దేవరాపల్లి/కె.కోటపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం పరిధిలోని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శనివారం పంపిణీ చేశారు. మాడుగుల మండలంలోని కేజేపురంలో పుట్టా వరలక్ష్మికి వైద్యం కోసం రూ.1.62 లక్షలు, ఎండపల్లి చిన్నాచారికి రూ.1.53 లక్షలు అందించారు. అలాగే దేవరాపల్లి మండలంలోని ఎం.అమండకు చెందిన జి.వెంకటలక్ష్మి, తెనుగుపూడికి చెందిన ఎస్.నర్సిబాబుకు, వేచలానికి చెందిన సాలపు మదు, కొత్తపెంటకు చెందిన రెడ్డి శ్రీనివాసు కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు. పేదలను ఆదుకోవడమే తెలుగుదేశంపార్టీ ధ్యేయంగా పనిచేస్తుందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. అనారోగ్యం పాలైన బాధిత కుటుంబాలకు శనివారం చోడవరం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెక్కులను పంపిణీ చేశారు. కె.కోటపాడుమండలంలోని చౌడువాడ, సూదివలస, వారాడ, గుల్లేపల్లి గ్రామాలకు చెందిన ఐదుగురికి రూ.6.02 లక్షలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు భీశెట్టి శ్రీనివాసరావు, పుప్పాల రమేశ్, సంతోష్‌కుమార్, విజయలక్ష్మి, ప్రసాద్, రఘు, హరి బాలకృష్ణ, పోతల పాత్రునాయుడు, సూర్యనారాయణ, రెడ్డి బలరాం, రొంగలి మహేశ్, కశిరెడ్డి దేముడుబాబు, రొంగలి శంకరరావు, లెక్కల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

కె.కోటపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చింతలపాలెం గ్రామంలో శనివారం అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

జబర్దస్త్, టీవీ సీరియల్ నటుల సందడి



జబర్దస్త్, టీవీ కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

చోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవంలో ఢీ డ్యాన్సర్, జబర్దస్త్ కళాకారుడు సందడి చేశారు. మహిళా వేషధారణలో జబర్దస్త్ పవన్ చేసిన స్కిట్లు, నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సీరియల్ నటి నయానా కూడా అందరినీ అలరించారు. ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ఎస్‌వీ.మాధవ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రముఖులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనాథు శ్రీనివాసరావు, దేవత అరుణ, గ్రంధి లావణ్య, రాజేశ్వరి, కొల్లూరు రూప, గోపిశెట్టి మంజుల తదితరులు పాల్గొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

» ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ మడ్డు ఇందిరాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ఇందిరాదేవి

కృష్ణాదేవిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సీపట్నం మండలంలోని ధర్మసాగరం మదర్ నర్సింగ్ కళాశాలలో గర్భాశయ క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్టు ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ మడ్డు ఇందిరాదేవి తెలిపారు. గర్భాశయ కాన్సర్ నివారణ అంశాలను విద్యార్థులు, మహిళలకు ఆమె వివరించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రోజూ సుమారు 200 మంది మృత్యువాత పడుతున్నారని, దీనికి అనుగుణంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నివారణకు వ్యాక్సిన్ వేసుకోవాలని, జీవన శైలిలో మార్పు ద్వారా నివారించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ మడ్డు వెంకటరమణ, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

10న గోవాడ షుగర్స్ వద్ద ధర్నా

అనకాపల్లి టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గోవాడ చక్కెర కర్మాగారం వద్ద ఈ నెల 10వ తేదీన నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని వైసీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకుడు కరణం ధర్మశ్రీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతాంగాన్ని కూటమి సర్కారు నిర్లక్ష్యం చేసిందని, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఫ్యాక్టరీకి కోట్లాది రూపాయల నిధులను సమకూర్చి అభివృద్ధిపరిచినట్టు చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఫ్యాక్టరీ పరిస్థితి దయనీయంగా మారిందని వాపోయారు. రైతుల సమస్యలపై సోమవారం ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్, పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల రమణారావు పాల్గొన్నారు.

ఎస్ఐగా వడ్డాది యువతి బాధ్యతలు



శ్రీకాకుళం ఎస్పీతో ఎస్ఐ వనిత

బుచ్చెయ్యపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాదికి చెందిన కొండపల్లి ప్రమీలాదేవి ఎస్ఐగా కొలువుదీరారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఆమె శనివారం శ్రీకాకుళం జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడ ఎస్పీని కలిశారు. వివాహం జరిగి పిల్లలు ఉన్నప్పటికీ ప్రమీలాదేవి ఆత్మవిశ్వాసంతో చదివి లక్ష్యాన్ని చేరుకుని మహిళలకు ఆదర్శంగా నిలిచారు. తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో ఎస్ఐ పోస్టును సాధించినట్టు ఆమె చెప్పారు.

ఉత్తమ ఉద్యోగిగా వడ్డాది పీఏసీఎస్ సీఈవో

బుచ్చెయ్యపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడ్డాది పీఏసీఎస్ సీఈవో ఎం.శాంతికి ఉత్తమ మహిళా ఉద్యోగిగా అవార్డు లభించింది. మహిళా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఆప్‌కాబ్ కార్యాలయంలో శుక్రవారం ఛైర్మన్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి చేతులమీదుగా ఆమె అవార్డును స్వీకరించారు. ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని ఈ సందర్భంగా ఆమె చెప్పారు.

ఉత్తమ అంగన్‌వాడీ కార్యకర్తగా జ్యోతి

బుచ్చెయ్యపేట: లోపూడి-2 అంగన్‌వాడీ కార్యకర్త కె.జ్యోతి ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసాపత్రం అందుకున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు పీడీ పుష్పదేవి చేతులమీదుగా శనివారం ఈ అవార్డు స్వీకరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి తదితరులు ఆమెను అభినందించారు.

పీ4 సర్వేకు సహకరించండి: ఎంపీడీవో

కె.కోటపాడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ4 సర్వేకు అందరూ సహకరించాలని ఎంపీడీవో సాంబశివరావు కోరారు. చంద్రయ్యపేటలో శనివారం ఈ సర్వేను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడమే ఈ సర్వే ఉద్దేశమన్నారు. సచివాలయ ఉద్యోగులు ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ఆయన సూచించారు.

ధారాలమ్మతల్లికి ప్రత్యేక పూజలు

నాతవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధారాలమ్మతల్లి ఆలయం ఏడో వార్షికోత్సవం శనివారం జరిగింది. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పైల పోతురాజు, తెలుగు రైతు సంఘం మండల అధ్యక్షుడు పైల సూరిబాబు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి యువకుడి హల్‌చల్

» ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపు

» నచ్చజెప్పి కిందకు దించిన ఎస్ఐ

దేవరాపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసైన ఓ యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కి శనివారం రాత్రి హల్‌చల్ చేశాడు. ఆత్మహత్య చేసుకుంటానని హడివిడి సృష్టించాడు. ఆ యువకుడికి ఎస్ఐ నచ్చజెప్పి కిందకు దించడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. దీనికి సంబంధించి ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. స్థానిక మోడల్ కాలనీకి చెందిన గేదెల ఈశ్వరరావు, గౌరీ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిద్దరూ మత్తు పదార్థాలకు బానిసలయ్యారు. వీరిలో పవన్(18) శనివారం తన తండ్రిని డబ్బులు అడిగాడు. ఉదయం ఇస్తానని చెప్పడంతో తండ్రిపై దాడి చేశాడు. తండ్రి ఈశ్వరరావు ఆస్పత్రికి వెళ్లగా, పవన్ ఇంట్లోని సామాన్లను చెల్లాచెదురు చేసి ఇంటికి సమీపంలో కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హల్‌చల్ చేశాడు. స్థానికుల సమాచారంతో సిబ్బందితో అక్కడికి చేరుకున్న ఎస్.ఐ.మల్లేశ్వరరావు రెండు గంటల పాటు ఆ యువకుడికి నచ్చజెప్పారు. ఎట్టకేలకు ఆ యువకుడు కిందకు దిగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

క్వారీ లారీ విధ్వంసం.. సింహద్వారం ధ్వంసం

రోలుగుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజన్నపేట క్వారీ యాజమాన్యం లారీల విధ్వంసంతో బుచ్చెంపేట గ్రామ శివారున ఆలయ సింహద్వారం ధ్వంసమైంది. నిబంధనలకు విరుద్ధంగా క్వారీ లారీలను నడుపుతూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు. దీనిలో భాగంగానే అధిక రాయి లోడ్‌లను తరలిండానికి అడ్డంకిగా ఈ సింహద్వారం ఉండడంతో రాత్రికి రాత్రే నేటమట్టం చేశారు. సింహద్వారంపై ఉన్న అమ్మవారి విగ్రహాన్ని కూడా దూరంగా పడేసి కనపడకుండా చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుని తక్షణమే సింహద్వారం పునర్నించాలని గ్రామస్థులు కోరుతున్నారు. గతంలో ఈ క్వారీ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే తాండవ అభివృద్ధి: ప్రాజెక్టు ఛైర్మన్

నాతవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే తాండవ రిజర్వాయర్ అభివృద్ధి చెందుతున్నదని ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లేడిపూడి దగ్గర ఎడమ కాలువలో రూ.10 లక్షలతో శనివారం పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల తాండవ మెయిన్ గేట్లు లికేజీలతో సాగునీరు వృథాగా పోయినా ఎవ్వరూ పట్టించుకోలేదని చెప్పారు. నేడు తాండవ మెయిన్‌గేట్లు మరమ్మతులకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పనులు పూర్తిచేసి వచ్చే ఖరీఫ్ నాటికి ఆయకట్టు రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కమిటీ వైస్ ఛైర్మన్ ఎం.జోగిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్.వెంకటరమణ, నాయకులు ఎల్.బాబులు, కె.వెంకటేశ్, ఎల్.నానిబాబు, లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ అప్పారావు పాల్గొన్నారు.

ప్రమాదకర కల్వర్టుకు ఇరువైపులా ఎర్ర జెండాలు



కల్వర్టుకిరువైపులా ఏర్పాటు చేసిన జెండాలు

చోడవరం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా మారిన వెంకన్నపాలెం సమీపంలోని కల్వర్టు వద్ద ఉపాధ్యాయుడు గోవింద్ శనివారం ఎర్ర జెండాలు కట్టి హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేశారు. ఈ కల్వర్టు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో ఓ తండ్రి, చిన్నారి బైక్‌తో సహా గోతిలో పడి గాయపడ్డ విషయం తెలిసిందే. అయినా అధికారులు స్పందించక పోవడంతో, ఉపాధ్యాయుడు గోవింద్ కల్వర్టు వద్ద ఎర్ర జెండాలు కట్టడంతో పాటు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

రావికమతంలో వరుస చోరీలతో భయంభయం

రావికమతం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరుస చోరీలు జరగడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. దుర్గానగర్‌లో శుక్రవారం రాత్రి ఒక వర్క్‌షాపు, మరో ఇంటిలో చోరీ జరిగింది. ఇంట్లో ఏమీ దొరకపోతే వరండాలో ఉన్న కుట్టు మిషన్‌ను అపహరించుకుపోయారు. ఈ ఇళ్లకు సమీపంలో హోండా షోరూం ఎదురుగా బీఎన్ రోడ్డును ఆనుకుని ఉన్న గోకాడ శ్రీరామూర్తి ప్యాచ్ వర్క్ దుకాణం తలుపు తాళం పగలగొట్టినా లోపలకు వెళ్లలేకపోయారు. గత నెలలో ఇదే ప్రాంతం, దుర్గానగర్‌లో చందక సత్తిబాబు తలుపు గొళ్లెం పగులగొట్టి దొంగలు ఆరు తులాల వెండి వస్తువులు, దేవుని హుండీ డబ్బాను అపహరించిన విషయం తెలిసిందే. ఈ సంఘటనలు మరవక ముందే తాజాగా చోరీలు జరగడంతో గృహ యజమానులు భయాందోళన చెందుతున్నారు.